క్లుప్తంగా

కంటి వెలుగును వినియోగించుకోవాలి



గట్టు: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌ఓ ఊసేని, మెడికల్ ఆఫీసర్ సాయికిరణ్ అన్నారు. శుక్రవారం మాచర్లలో కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 145 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 10 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 15 మందికి కంటి అద్దాల కోసం ప్రతి పాదనలు పంపించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



ధరూరు: గద్వాలలో ఈ నెల 12న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్‌లు కోరారు. శుక్రవారం మండలంలోని పెద్ద పాడు, భీంపురం, ఎములోనిపల్లి, రేవులపల్లి, ఉప్పేరు, ఖమ్మంపాడు, గార్లపాడు గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను వారు విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అయిజ: మండలంలోని పులికల్‌కు చెందిన లక్ష్మికి శుక్రవారం పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్‌లో గర్భిణీ లక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం అయిజ పీహెచ్‌సీకి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాటం

ఆత్మకూర్: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూర్‌లోని ఎస్టీయూ భవనం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లాకార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ ఎనలేని కృషి చేస్తుందన్నారు. సంఘం ఏర్పాటులో ముగ్దూం మోయినోద్దీన్ కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లోఉన్న డీఏ ఇవ్వాలని, మెడికల్, జీపీఎఫ్ బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్దమందడి మండల అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, గోపాల్‌పేట అధ్యక్షుడు నర్సింహారావు, కొత్తకోట అధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు సుశీలమ్మ, రియాజుద్దీన్, దోమశ్రీను, విజయప్రకాష్, శ్రీలత, అంజుమ్‌షాహీన్ పాల్గొన్నారు.

చిన్నచూపు తగదు

పెబ్బేరు: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో ప్రభుత్వం ముదిరాజులను అవమానించిదని, ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష ఆర్థికసాయంలో వారిని నిర్లక్ష్యం చేసిందని శుక్రవారం ముదిరాజ్ సంఘం నాయకులు గోల్డ్ బాలస్వామి ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ముదిరాజ్‌లను రూ.లక్ష ఆర్థిక సాయం అందించే జాబితాలో చేర్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రస్తుతం ఈ పథకాన్ని నిలిపి వేయాలని లేని పక్షంలో నిరసన కార్యాక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలని సూచించారు. జూన్ 23 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- బీటీ రహదారులపై గుంతలు
- ప్రమాదాలబారిన వాహనదారులు



ఎల్కూర్ - మల్దకల్ గ్రామాల మధ్య గుంతలమయంగా రోడ్డు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల ప్రజల సౌకర్యార్థం బీటీ రహదారులు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మల్దకల్- మద్దెల బండ, సద్దలోనిపల్లి – నేతువానిపల్లి, తాటికుంట – తప్పెట్లమొర్సు- ఎల్కూరు- మల్దకల్, నాగర్‌దొడ్డి స్టేజీ – తూంకుంట, దాసరపల్లి- నేతువానిపల్లి గ్రామాల మధ్యన ఉన్న బీటీ రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ రోడ్లపై భారీ వాహనాలతో పాటు వర్షాలకు రోడ్లు అక్కడక్కడ దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల రోడ్డుకు అటు ఇటు పొలాలు ఉన్న రైతులు రోడ్డును అడ్డంగా తవ్వి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవడంతో సమస్య మరింత జఠిలమైంది. రోడ్లపై తవ్విన గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చివేయలేదు. .

పట్టించుకోని అధికారులు

తవ్విన రోడ్లను మరమ్మతు చేయాల్సిన అధికారులు వాటిపై తాత్కాలికంగా అక్కడక్కడ మట్టిని వేసి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చడం లేదు. ప్రమాదాలను నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్లలో ఉన్న మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టడంతో పాటు మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నాం. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతు చేయించాలి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, సద్దలోనిపల్లి

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బీటీ రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్డుపై గుంతలు కనిపించక పోవడంతో పాటు సూచికబోర్డులు లేని కారణంగా నిత్యం ఎక్కడో ఒక చోట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– రాముడు, నాగర్‌దొడ్డి

సమస్య పరిష్కారానికి చర్యలు



మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఏర్పడిన గుంతలను పరిశీలించాం. నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించాం. నిధులు మంజూరు అయిన వెంటనే రోడ్లకు మరమ్మతు చేపడతాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ పంచాయతీరాజ్, మల్దకల్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గద్వాల అర్బన్: గద్వాల పట్టణంలోని ఎక్స్‌ప్రెస్ ఫిడర్, టౌన్ –4ఫీటర్లకు ఎల్‌సీ తీసుకోవడం నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు, ఐసీఐసీఐ బ్యాంకు, అంబేద్కర్ చౌక్, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, సెకండ్ రైల్వేగేటు, దౌదర్‌పల్లి, పిల్లిగుండ్ల, అయిజ రోడ్డు, న్యూ హౌసింగ్ కాలనీలకు ఉదయం 7:30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు వీరశైవ లింగాయత్‌ల సమావేశం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని భద్రకాళి వీరభద్ర ఆలయంలో ఈనెల 11న వీరశైవ లింగాయత్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వీఎల్‌పీ రాష్ట్ర కార్యదర్శి బీజాపూర్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరశైవ లింగాయత్‌లను ఓసీలో చేర్చుట, కార్పొరేషన్ ఏర్పాటు, డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు తదితర సమస్యలను చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 12 గద్వాల రానున్న సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని వివరించారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వీరశైవ లింగాయత్‌లు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ



అలంపూర్ చౌరస్తాలో మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా శుక్రవారం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. ఆడపిల్లల పెళ్లిల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూ.100116లు అందజేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో 1050 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. కుల వృత్తుల వారికి ఒక్కొక్కరికి రూ. లక్ష వరకు అందిస్తోందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

చెక్కుల అందజేత

అలంపూర్ నియోజవర్గంలోని 144 మహిళా సంఘాలకు రూ. 11.51 కోట్ల విలువ గల చెక్కులను మహిళా సంఘాలకు ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అందజేశారు. గొర్రెల పంపిణీ యూనిట్ల ప్రారంభించారు. మహిళా సంఘాల ద్వారా ఒక ట్రాక్టర్‌ను అందజేశారు. కులవృత్తుల వారికి రూ. ఒక లక్ష పంపిణీ చేశారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ బీసమ్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్రాముడు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలుచేయాలి



ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

ఆత్మకూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఆర్భాటంగా జరుపుకొంటున్న ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ప్రసాద్, జిల్లా నాయకుడు రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా కోటి ఉద్యోగాలు భర్తీ కాలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ జరుగలేదని, డబుల్ బెడ్రూంఇళ్ల ఊసే లేదని, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగ భృతి లేదని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆరోపించారు. ధరణి వెబ్‌సైట్ అవకతవకలను సరి చేయాలని, పంటల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, బాలస్వామి, వెంకటేష్, రాములు, లక్ష్మణ్, వెంకటమ్మ, శిరీష, సుజాత తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

కొత్తకోట: పట్టణ కేంద్రంలో 30ఏళ్లుగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా 11వ పీఆర్సీ కమిషన్ సిఫారను చేసిన వేతనాలు రూ. 19 నుంచి 30 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఏడాదికి మూడు జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వడంతో పాటు వయసు మీరిన వారిని తొలగిస్తే కుటుంబంలో వారసులకు ఉద్యోగం, రిటర్మెంట్ బెనిఫిట్‌గా రూ. 10 లక్షలు, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. ఆదివారం, పండుగ సెలవులు చేయాలని, అలాగే మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటయ్య, శివ, ఆనంద్, రాజు, ఎర్రన్న, సత్తిరెడ్డి ప్రసాద్, నోవెల్, లక్ష్మి, శిరీష, సరళ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



సామూహిక సీమంతంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

ధరూరు: మండలంలోని ఉప్పేరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మాశమ్మ, ఉప సర్పంచ్ అంజు రెడ్డి, ఎంపీటీసీ మునెప్ప, సూపర్‌వైజర్ బాల నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, కృష్ణవేణి, గాయిత్రి, శోభారాణి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కురిసిన వర్షం

ఉండవెల్లి: మండల కేంద్రంతో పాటు కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, తక్కశిల, గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లపై చెట్లు కూలాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గుంతలు, కుంటలలో వర్షపు నీరు నిలిచింది.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



అలంపూర్: పార్టీ బలోపేతానికి కలికట్టుగా పని చేద్దామని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామానికి చెందిన పేరపోగు తిరుపాల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నియామక పత్రం అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్న మహేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, జీఎం కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు గౌడ్, జిల్లా మహిళా కన్వీనర్ శారదమ్మ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లితండా ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతు పనులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.లక్ష మంజూరు చేసినట్లు ఎంపీపీ మేఘారెడ్డి తెలిపారు. నిధుల ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం తండావాసులకు ఎంపీపీ మేఘారెడ్డి అందజేశారు. పాఠశాల భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఎంపీపీ మేఘారెడ్డికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, బాలరాజు, తిరుపతయ్య, వెంకటేష్, శివయాదవ్ ఉన్నారు.



వాగ్దానాలు నెరవేర్చాలి



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల రూరల్: సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ముస్లిం, మైనార్టీ అఖిల పక్షం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్ పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్, మైనార్టీ రెసిడెన్సియల్ బాలుర పాఠశాల, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో 15 స్థానాలను ముస్లింలకు కేటాయించాలన్నారు. రూ.2లక్షల రుణాలు అందించి ఆర్థిక తోడ్పాటు ఇవ్వాలని వివరించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని విన్నవించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి వినతి

గద్వాల రూరల్: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న స్వీపర్స్, వాటర్ మెన్, డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇఫ్టూ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంట్రామిరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, అదేవిధంగా వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలన్నారు. జనాభా ప్రాతిపదికన సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు. కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు నివారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, కార్తీక్, రాఘవేంద్ర, రంగన్న, గోవిందు, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నిర్వాసితులు

గట్టు: గద్వాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని చిన్నోనిపల్లె నిర్వాసితులు శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్ గద్వాలకు వస్తున్న నేపథ్యంలో ఎంపీపీ విజయ్‌కుమార్‌తో నిర్వాసితులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. నిర్వాసితు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నిర్వాసితులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలి

అలంపూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని ప్రధానోపాధ్యాయుడు రాములు దయాళ్ కోరారు. కర్నూల్‌లో ఎమ్మెల్సీ నివాసంలో హెచ్‌ఎం గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు.

నడిగడ్డ అభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష



మాట్లాడుతున్న కేశవరావు

శాంతినగర్: నడిగడ్డ అభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంసీ కేశవరావు ఆరోపించారు. వడ్డేపల్లి పురపరిధిలోని శాంతి నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. జోగుళాంబ ఆలయానికి వంద కోట్లు ఇస్తామని మోసం చేశారన్నారు. గద్వాలలో వంద పడకల ఆస్పత్రి, తుమ్మిళ్ల ప్రాజెక్టు పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై సమాధానాలు చెప్పిన తర్వాత సీఎం కేసీఆర్ గద్వాలలో అడుగుపెట్టాలన్నారు. లేని పక్షంలో సీఎం కాన్వాయ్‌ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవిచందర్, పచ్చర్ల రాజారావు, ఉదయ్, దస్తగిరి, నాగేంద్ర పాల్గొన్నారు.

పక్కదారి పడుతుందా?

- చిన్న ధన్వాడలో ఇసుక తీతకు ప్రభుత్వ అనుమతులు
- అక్రమాలు కాకుండా చూడాలంటున్న ప్రజలు



చిన్న ధన్వాడలో టిప్పర్‌లో ఇసుక నింపుతున్న ఇటాచీ

రాజోళి: మండలంలోని చిన్న ధన్వాడ వద్ద గల తుంగభద్రనదిలో ప్రభుత్వ కట్టడాలకు ఇసుక తీసేందుకు అనుమతులున్నాయి. ఈ అనుమతుల ముసుగులో ఇసుక పక్కదారి పడుతుందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. గతంలో సాండ్ ట్యాక్సీ వాహనాలకు అనుమతులు ఇవ్వగా ట్రాక్టర్ల ద్వారా గృహ అవసరాలకు ఇసుకను ప్రభుత్వానికి చలాన్ కట్టిన వారికి అందజేసేవారు. అదే చోట ప్రస్తుతం ఇసుక కోసం టిప్పర్లు రావడం, వాటిని కూడా జేసీబీలు, ఇటాచీలు నేరుగా నదిలోని దిగి లోడ్ చేస్తుండటంతో గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల వారికి అనుమానాలు రాకపోలేదు. జిల్లాలోని పలు సాగునీటి రిజర్వాయర్లకు ఇసుకను తరలిస్తున్నామని, దీనికి ప్రభుత్వ అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ఇసుక నిర్దేశించిన చోటకే పోతుందా లేక అడ్డదారిలో పక్కకు వెళ్లి ఇసుకాసురులకు కాసులు కురిపిస్తుందా? అని ప్రజల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. టిప్పర్లు కూడా పదుల సంఖ్యలో రావడం, అధిక లోడ్‌తో వెళ్లడంతో రోడ్లు దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వ కట్టడాలకు పూర్తి స్థాయిలో అందకుండాపోతుందనే వాదనలున్నాయి. ప్రభుత్వ అవసరాల పేరుతో అనుమతులు తెచ్చుకుని, ఇసుకను పక్కదారి పట్టించకుండా అవసరాలకే వాడాలని ప్రజలు కోరుతున్నారు. కూలీలతో ఇసుకను లోడ్ చేయకుండా జేసీబీలతో చేయించడం సరికాదని అంటున్నారు.

పర్యవేక్షణ ఉంది..

చిన్న ధన్వాడ నుంచి జిల్లాలో నిర్మిస్తున్న చిన్నోనిపల్లె, సోమనాద్రి రిజర్వాయర్లకు ఇసుకను తీసుకునేందుకు అనుమతులు ఉన్నాయి. దీనిపై ప్రత్యేకంగా కలెక్టర్ పర్యవేక్షణ ఉంది. ఇసుక పక్కదారి పట్టకుండా సిబ్బందిని కూడా ఉంచాం.

– విజయరామరాజు, మైనింగ్ ఏడీ